ప్రజా **రిపబ్లిక్**

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnol,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Districts

సంపుటి - 01 సంచిక -275 పేజీలు - 04 వెల - 06/- సోమవారం 6 జనవరి 2025

# జగన్ జిల్లా టూర్లకు ఆదిలోనే బ్రేకులు ?



జనవరి 05 (రిపబ్లిక్ న్యూస్):

వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జిల్లాల యాత్రకు శ్రీకారం చుడతానని దాదాపు నెల రోజుల క్రితం పార్టీ సమావేశాలలో చెప్పడం జరిగింది. తాను వచ్చి క్యాడర్ కి ధైర్యం చెబుతాను భరోసా కల్పిస్తామని వారితోనే ఉంటానని ఆయన ప్రకటించారు. అంతే కాదు ప్రతీ బుధ గురువారం రెండు రోజుల పాటు జిల్లా కేంద్రంలో ఉండి క్యాడర్ ని పూర్తి స్థాయిలో కలుస్తాను అని వారి నుండి అభిప్రాయాలు సేకరించడం ద్వారా పార్టీని గ్రౌండ్ లెవెల్ నుంచి పునరుత్తేజం కల్పించేలా చూస్తాను అని జగన్ ప్రకటించారు. దీంతో జగన్ జిల్లాల టూర్ మీద వైసీపీలో కొంత ఉత్సాహం కనిపించింది. మొదట సంక్రాంతి పండుగ తరువాత అన్నారు, ఆ తరువాత జనవరి నెలాఖరు అన్నారు. అయితే ఇపుడు చూస్తే ఆదిలోనే బ్రేకులు పడేట్టుగా ఉన్నాయని అంటున్నారు. జగన్ ఈ నెల 11 నుంచి రెండు వారాల పాటు లండన్ ట్రిప్ పెట్టుకున్నారు. ఈ మేరకు ఆయన సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి విదితమే. తన విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వాలని ఆయన కోరారు. దాని మీద విచారణ ఈ నెల 8కి వాయిదా పడింది. ఆ రోజున కోర్టు ఇచ్చే తీర్పు బట్టి జగన్ పర్యటన ఉండొచ్చు. అయితే జగన్ కి అనుమతి లభిస్తే ఆయన ఈ నెలాఖరు వరకూ విదేశాలలోనే ఉండే చాన్స్ ఉంది. ఆయన నెల చివరికి వచ్చినా అప్పటి నుంచి జిల్లా పర్యటనకు ఏర్పాట్లు చేయడం అంటే కుదిరేది కాదు,

మిగతా 2లో

# బుద్దా వెంకన్న, బొండా ఉమలపై దాడి కేసు నిందితుడు తురకా కిశోర్ అరెస్ట్

**గత ప్రభుత్వ హయాంలో టీడీపీ నేతలు బుద్ధా వెంకన్న, బొండా ఉమలపై దాడి**

**మాచర్లలో దాడికి పాల్పడిన తురకా కిశోర్**

**కూటమి ప్రభుత్వం వచ్చాక అజ్ఞాతంలోకి వెళ్లిన కిశోర్**

**తాజాగా హైదరాబాదులో అరెస్ట్**



జనవరి 05 (రిపబ్లిక్ న్యూస్):

గత ప్రభుత్వ హయాంలో టీడీపీ నేతలు బుద్ధా వెంకన్న, బొండా ఉమలపై మాచర్లలో దాడి చేసిన వైసీపీ నేత తురకా కిశోర్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. తురకా కిశోర్... వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ప్రధాన అనుచరుడనే పేరుంది! గతంలో వైసీపీ ప్రభుత్వం అండ చూసుకుని కిశోర్ అనేక దౌర్జన్యాలకు, అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చాక అరెస్ట్ భయంతో తురకా కిశోర్ అజ్ఞాతంలోకి వెళ్లాడు. అయితే, అతడి కోసం గాలిస్తున్న పల్నాడు పోలీసులు తాజాగా హైదరాబాదులో అరెస్ట్ చేశారు. ఈ దాడి కేసులో గత ప్రభుత్వ హయాంలోనే తురక కిశోర్ ను అరెస్ట్ చేసినప్పటికీ, ఒక్కరోజు వ్యవధిలోనే అతడికి స్టేషన్ బెయిల్ ఇచ్చారు.

## ఈ నెల 17న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం !



ఏపీ కేబినెట్ సమావేశం ఈ నెల 17న జరగనుంది. వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం జరగనుంది.కేబినెట్ భేటీలో పాలనాపరంగా ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. అలాగే వివిధ సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రివర్గం చర్చించి నిర్ణయం తీసుకోనుంది. అలాగే సీఎం చంద్రబాబు దావోస్ టూర్ పై కూడా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఈ సమావేశం తరువాత మరుసటి రోజు సీఎం చంద్రబాబు బృందం దావోస్ పెట్టుబడుల సదస్సుకు వెళ్లనుంది.

# మోడీ విశాఖ సభ చరిత్రలో నిలిచిపోవాలి



**కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపనల కోసమే**

**మోదీ విశాఖ వస్తున్నారు: మంత్రి నారా లోకేశ్**

**ఈ నెల 8న విశాఖలో ప్రధాని మోదీ పర్యటన**

**పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్న ప్రధాని**

**ఎన్డీయే విజయం తర్వాత తొలిసారి ఏపీకి ప్రధాని**

**ఘనంగా స్వాగతం పలుకుతామన్న నారా లోకేశ్**

జనవరి 05 (రిపబ్లిక్ న్యూస్):

ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 8న విశాఖ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో, ఏపీ మంత్రి నారా లోకేశ్ ఇవాళ విశాఖలో సమీక్ష నిర్వహించారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లను లోకేశ్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, కీలక ప్రాజెక్టుల శంకుస్థాపనల కోసమే ప్రధాని విశాఖకు వస్తున్నారని తెలిపారు. ప్రధాని మోదీ తన పర్యటనలో నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు, మిగతాది 2లో...

## పర్యాటక రంగంలో పెట్టుబడిదారులకు రాయితీలు!

**రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి దుర్గేష్**



# విజయవాడలో హైందవ శంఖారావం సభ

**డిక్లరేషన్ ప్రకటించిన వీహెచ్ పీ**

**వీహెచ్ పీ ఆధ్వర్యంలో కేసరపల్లి వద్ద భారీ ఎత్తున హిందూ సభ**

**లక్షలాదిగా తరలివచ్చిన ప్రజలు**

**హాజరైన చినజీయర్ స్వామి, గణపతి సచ్చిదానంద స్వామి తదితరులు**



జనవరి 05 (రిపబ్లిక్ న్యూస్):

హిందూ ధర్మ పరిరక్షణ, దేవాలయాల విశిష్టతను కాపాడడం, ముఖ్యంగా ఆలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించడం తదితర అంశాలే అజెండాగా విజయవాడ కేసరపల్లిలో హైందవ శంఖారావం సభ నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ (వీహెచ్ పీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సభకు లక్షలాదిగా తరలివచ్చారు. చిన్నజీయర్ స్వామి, గణపతి సచ్చిదానంద స్వామి తదితర ఆధ్యాత్మికవేత్తలు ఈ సభకు హాజరై కీలక ప్రసంగాలు చేశారు. కాగా, ఈ హైందవ శంఖారావం సభలో వీహెచ్ పీ కీలక డిక్లరేషన్ ను ప్రకటించింది. చినజీయర్ స్వామి హైందవ శంఖారావం డిక్లరేషన్ ను అందరితో ప్రతిజ్ఞ చేయించారు.



మిగతా 2లో

# జాతీయ రాజకీయాల్లో తెలుగువారి పాత్ర సన్నగిల్లుతోంది : సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాదులో ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలు**

**హాజరైన సీఎం రేవంత్ రెడ్డి**

**ఏ రంగంలో ఎంత ఎత్తుకు ఎదిగినా సొంత భాషను మర్చిపోరాదని సూచన**



జనవరి 05 (రిపబ్లిక్ న్యూస్):

హైదరాబాదులో జరుగుతున్న ప్రపంచ తెలుగు సమాఖ్య 12వ మహాసభలకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. దేశంలో హిందీ తర్వాత అత్యధికులు మాట్లాడే భాష తెలుగు అని పేర్కొన్నారు. తెలుగుభాష ఉనికిని, మనుగడను, మన సంప్రదాయాన్ని కోల్పోకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. జాతీయ రాజకీయాల్లో తెలుగువారి పాత్ర సన్నగిల్లుతోందని, ఈ విషయంలో అందరూ ఆలోచించాలని అన్నారు. మిగతాది 2లో...

# సత్ ప్రవర్తన కలిగి సమాజంలో మంచి పౌరులుగా జీవనం సాగించాలి

## - నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని కౌన్సెలింగ్





నంద్యాల క్రైం, జనవరి 5, (రిపబ్లిక్ న్యూస్): జిల్లాలో నేర నియంత్రణ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు వారి పోలీస్ స్టేషన్ల పరిధిలో నివసిస్తున్న రౌడీ షీటర్లకు ,నేరచరిత్ర గలవారికి ,చెడు నడత కలిగిన వ్యక్తులకు సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి చెప్పి మంచి పౌరులుగా జీవించాలని కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ప్రస్తుతం వారు జీవిస్తున్న విధానం, జీవనోపాధికి చేస్తున్న వృత్తులపై ఆరా తీశారు.అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన్న రాదని మీపై నిరంతరం నిఘా ఉంటుందని,పోలీసుల మాటలను వినకుండా చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీస్ అధికారులు హెచ్చరించారు.

# జగన్ జిల్లా టూర్లకు ఆదిలోనే బ్రేకులు ?

కాబట్టి అన్నీ చూసుకుని మాఘమాసం లో మంచి ముహూర్తాన జగన్ జిల్లాల పర్యటనలకు సిద్ధపడతారు అని అంటున్నారు అంటే ఫిబ్రవరి రెండో వారంలో కానీ మూడవ వారంలో కానీ జగన్ జిల్లాల టూర్ ఉండే చాన్స్ ఉందని అంటున్నారు. అయితే వైసీపీకి మొత్తం దిక్కు అయిన జగన్ జిల్లాల టూర్ పేరుతో జనంలోకి వస్తేనే పార్టీ యాక్టివ్ అవుతుందని నాయకులు అంటున్నారు. గతంలో విపక్షంలో ఉన్నపుడు జగన్ పెద్దగా ఆలస్యం చేయకుండానే ప్రజలలోకి వచ్చారు. అయితే ఈసారి అయిదేళ్ల పాటు అధికారంలో ఉన్న పార్టీగా వైసీపీ జనంలోకి వెళ్తోంది. కాబట్టి తమ ప్రభుత్వానికి కూటమి ప్రభుత్వ పాలంకు మధ్య జనాలు తేడా తెలుసుకోవడానికి కొంత వ్యవధి ఇవ్వాలన్న ఆలోచనతొనే జగన్ ఈ విధంగా ఆరేడు నెలల సమయం తీసుకున్నారు అని అంటున్నారు. మొత్తం మీద జగన్ ఎంత వేగంగా జనంలోకి వస్తే అంత పార్టీకి మేలు అన్న మాట ఉంది. అయితే జనవరి నెలలో జగన్ విదేశీ పర్యటన ఉండడంతో ఫిబ్రవరికి ఆయన టూర్లు వాయిదా పడవచ్చు అన్నది వినిపిస్తున్న మాట. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# మోడీ విశాఖ సభ చరిత్రలో నిలిచిపోవాలి

రూ.70 వేల కోట్ల ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ, విశాఖ–చెన్నై ఎకనామిక్ కారిడార్ లో కృష్ణపట్నం వద్ద కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన... రూ.3,900 కోట్లతో పూర్తయిన రహదారుల ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం చేస్తారని లోకేశ్ వివరించారు. ముఖ్యమైనది, మనందరి కల విశాఖ రైల్వేజోన్ హెడ్ క్వార్టర్స్ నిర్మాణానికి ప్రధాని శంకుస్థాపన చేస్తారని వెల్లడించారు. గత ప్రభుత్వం కనీసం భూమి కూడా కేటాయించలేదని, దాంతో రైల్వే జోన్ ఆలస్యమైందని అన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం భూమిని కేటాయించడంతో, రైల్వే జోన్ భవన నిర్మాణాలకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేస్తారని లోకేశ్ వివరించారు. ఇదేకాకుండా, పలు రైల్వే అభివృద్ధి పనులకు కూడా ప్రధాని శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఎన్నికల్లో ఎన్డీఏ విజయం తర్వాత తొలిసారిగా విశాఖ వస్తున్న ప్రధానికి ఘనస్వాగతం పలుకుతామని మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. గాడితప్పిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు కట్టుబడి ఉన్నామని... గత వైసీపీ ప్రభుత్వం ఒక ఫేక్ ప్రభుత్వం అని విమర్శించారు. గత సర్కారు ఉత్తరాంధ్ర యువతకు ఎలాంటి ఉపాధి చూపించలేదని అన్నారు. అభివృద్ధి చేయకుండా ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని గాలికి వదిలేశారని మండిపడ్డారు. ప్రముఖ ఐటీ కంపెనీ టీసీఎస్ ను విశాఖకు తెచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఇక్కడి ఎయిర్ పోర్టుకు భూసేకరణ చేసిన ఘనత కూడా ఎన్డీయే కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. విశాఖలోని రుషికొండ ప్యాలెస్ ను ఏంచేయాలో తెలియని పరిస్థితి నెలకొందని వ్యాఖ్యానించారు. ఒక్క వ్యక్తి కోసం రూ.1000 కోట్లు వృథా చేశారని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం ఉన్న కంపెనీలన్నింటినీ తరిమేసిందని, కూటమి ప్రభుత్వం వచ్చాక గూగుల్, టీసీఎస్ వంటి కంపెనీలు ఏపీకి వస్తున్నాయని వివరించారు. వాలంటీర్లకు సంబంధించి గత ప్రభుత్వం ఎలాంటి జీవో ఇవ్వలేదని లోకేశ్ స్పష్టం చేశారు. ఎన్నికల వేళ 80 శాతం మంది వాలంటీర్లతో జగన్ రాజీనామా చేయించారని వెల్లడించారు.

# జాతీయ రాజకీయాల్లో తెలుగువారి పాత్ర సన్నగిల్లుతోంది

"గతంలో దేశ రాజకీయాల్లో ఎందరో తెలుగువారు క్రియాశీలకంగా వ్యవహరించారు. నీలం సంజీవరెడ్డి, పీవీ నరసింహారావు, ఎన్టీఆర్, కాకా వెంకటస్వామి, జైపాల్ రెడ్డి, వెంకయ్యనాయుడు వంటి నేతలు దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. రాజకీయం, సినీ, వాణిజ్య రంగాల్లో రాణించినప్పటికీ మన భాషను మర్చిపోరాదు. పరభాషా జ్ఞానం సంపాదిస్తే మంచిదే... కానీ సొంత భాషను గౌరవించాలి. తెలుగు భాషను గౌరవించే క్రమంలో, ఇటీవల రైతు రుణమాఫీ జీవోను తెలుగులోనే ఇచ్చాం. అలాగే, న్యాయస్థానాల్లో తీర్పుల ప్రతులు తెలుగులో ఉంటే ఎంతోమందికి ఉపయుక్తంగా ఉంటుంది" అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. "తెలంగాణ, ఏపీ... రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధిలో ప్రపంచంతో పోటీపడేలా ముందుకు వెళ్లాలి. తెలంగాణ రైజింగ్ నినాదంతో, అభివృద్ధి ప్రణాళికలతో తెలంగాణలో ముందుకు వెళుతున్నాం. ప్రపంచంలో అత్యున్నత నగరంగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. విదేశాల్లో స్థిరపడిన తెలుగువారు తెలంగాణలో పెట్టుబడులు పెట్టి, రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలి. పెట్టుబడులతో వచ్చేవారికి సింగిల్ విండో అనుమతులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని వివరించారు.

## పర్యాటక రంగంలో పెట్టుబడిదారులకు రాయితీలు!

### రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి దుర్గేష్

ఏపీలో పర్యాటక, సినీ రంగంలో పెట్టుబడులకు విస్తారమైన అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా పీపీపీ విధానంలో ముందుకు వెళ్తున్నామని పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.హైదరాబాద్ హైటెక్స్‌లో జరుగుతున్న అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ కేటలిస్ట్ గ్లోబల్ బిజినెస్ కాన్ఫరెన్స్‌లో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని ప్రసంగించారు. ఏపీ నూతన టూరిజం పాలసీ 2024-29 వివరాలను ఆయన వెల్లడించారు. ఏపీలో పెట్టుబడి పెట్టే పెట్టుబడిదారులకు కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం, రాయితీలు అందిస్తుందని వెల్లడించారు.సరైన ప్రతిపాదనలతో వస్తే స్పందించి అవకాశం కల్పిస్తామన్నారు. పర్యాటక, చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి కావలసిన మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలను వివరించారు. నూతన టూరిజం పాలసీ 2024-29 విధి విధానాలు, నూతన ఆవిష్కరణలను పారిశ్రామికవేత్తలకు మంత్రి వివరించారు.

# వెలుగోడు లో రికార్డు స్థాయిలో తెదేప సభ్యత్వ నమోదు..

## -పట్టణ అధ్యక్షుడు ఖలీల్ ఖాన్



వెలుగోడు జనవరి 5 రిపబ్లిక్ న్యూస్
వెలుగోడు లో రికార్డు స్థాయిలో 5800 పైగా సభ్యత్వ నమోదు ను చేసినట్లు పట్టణ అధ్యక్షుడు ఖలీల్ ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఎం శంకర్ రెడ్డి, ఖలీల్ ను మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు ముల్ల వీధిలో ఆదివారం సభ్యత నమోదు కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రజలు తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కోసం స్వచ్ఛందంగా ముందుకు రావడం అర్షించదగ్గ విషయమన్నారు .ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు,యోగేష్ గౌడ్, నాగరాజు నాయక్, మస్తాన్, రమణ, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ చార్జీలు ,విద్యుత్ అవసరాలపై అభిప్రాయ సేకరణ...

## -ఏఈ రవీంద్ర నాయక్.

వెలుగోడు జనవరి 5 రిపబ్లిక్ న్యూస్ 2025 -26 ఆర్థిక సంవత్సరానికి డిస్కం ప్రకటించిన వార్షిక ఆదాయం, విద్యుత్ అవసరాలు, విద్యుత్ చార్జీలపై ఈనెల జనవరి 7 మరియు 8వ తేదీలలో విజయవాడలో ,జనవరి 10వ తేదీ కర్నూలు నుండి ఏపీఈఆర్సి అధికారులు హైబ్రిడ్ విధానంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం జరుగుతుందని వెలుగోడు మండల విద్యుత్ శాఖ ఏఈ రవీందర్ నాయక్ తెలిపారు. కావున వినియోగదారులు నంద్యాల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పవర్ హౌస్ కాంపౌండ్ జరిగే అభిప్రాయ సేకరణకు పైన తెలిపిన తేదీలలో పాల్గొని అభిప్రాయాలు, అభ్యంతరాలు తెలుపగలరన్నారు. ఈ అభిప్రాయ సేకరణ భౌతిక హాజరుగా ఉదయం 10 గంటల నుండి ఒంటిగంట వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుండి నాలుగున్నర గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తమ అభిప్రాయాలను,అభ్యంతరాలను తెలుపగలరు అని అన్నారు.

# సుబ్రహ్మణ్యేశ్వరునికి ప్రత్యేక పూజలు



పాణ్యం జనవరి.05ప్రజా రిపబ్లిక్ న్యూస్ : పాణ్యం మండలంలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ఆలయ ఈవో యం.రామక్రిష్ణ ఆధ్వర్యంలో ఆదివారం రోజున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నాగలింగేశ్వర స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు కంపమల్ల నారాయణ శర్మ, కంపమల్ల సురేష్ శర్మ ఆధ్వర్యంలో ప్రాతఃకాల పూజలు, గందం అభిషేక పూజలు, రుద్రాభిషేకం, అర్చన కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి కాయకర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. అనంతరం మధ్యాహ్నకాల మహా నివేదన సమయంలో స్వామివారికి సర్ప సూక్తంతో సుగంధ ద్రవ్యాలతో, పంచామృత అభిషేకం, మహా రుద్రాభిషేకం, మహా నైవేద్యం, మహా మంగళహారతి ఇవ్వడం జరిగింది. విచ్చేసిన భక్తాదులందరూ విశేషంగా స్వామి వారిని దర్శించుకున్నారు. ఇక్కడ ప్రతి మంగళవారం ప్రత్యేకంగా రాహు కేతు పూజలు, సంతానం లేని వారు, కళ్యాణం కాని వారు, ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఉన్నవారు 108 ప్రదక్షిణాలు చేసి స్వామివారిని దర్శించుకుంటే వారి కోరికలు కచ్చితంగా నెరవేరుతాయని భక్తుల నమ్మకం. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తాదులందరికి దేవస్థానం ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తుంటారు.

# కల్లా వారి ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్





కర్నూల్ ప్రతినిధి జనవరి 05 (రిపబ్లిక్ న్యూస్):
ఈరోజు కల్లా నాగవేణి రెడ్డి ఆధ్వర్యంలో అశోక్ నగర్ పార్కులో ఏర్పాటుచేసిన వాలీబాల్ టోర్నమెంట్ ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎస్ వి మోహన్ రెడ్డి వైఎస్ఆర్సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షులు ఈ కార్యక్రమంలో పాల్గొని టోర్నమెంట్ ను ప్రారంభించారు. మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏదో ఒక స్పోర్ట్స్ లో ఉండాలని కోరారు ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు తప్పకుండా అలవాటు ఉండాలని ఆయన మాట్లాడారు. టోర్నమెంట్ నిర్వహకులు అశోక్ నగర్ చెందిన వైఎస్ఆర్సిపి యువ నాయకులు శ్రీకాంత్ రాజు తిమ్మప్ప భాస్కరు మిత్రబృందం మరియు వైఎస్ఆర్సిపి జిల్లా అనుబంధ అధ్యక్షులు నాయకులు మరియు వైఎస్ఆర్సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అఖిలభారత ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం జాతీయ కార్యవర్గ సమావేశం

న్యూ ఢిల్లీ /కర్నూల్ జనవరి 05. (రిపబ్లిక్ న్యూస్) అఖిల భారత ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం (ఎ ఐ పి టి ఎఫ్) మొదటి జాతీయ కార్యవర్గ సమావేశం ఈ రోజు అఖిల భారత ప్రాథమిక ఉపాధ్యాయ భవన్ డి బ్లాక్ జనక్ పురి నందు జరిగింది . గత డిసంబర్ 2 వ తేదీన కొచ్చి కేరళ లో జాతీయ కార్యవర్గ ఎన్నికలు జరిగాక నూతన సంవత్సరం లో జరుగుతున్న మొదటి సమావేశానికి ఎ ఐ పి టి ఎఫ్ జాతీయ అధ్యక్షుడు బసవరాజ్ గురికర్ అధ్యక్షత వహించారు , జాతీయ సెక్రటరీ జనరల్ కమలా కాంత్ త్రిపాఠి పర్యవేక్షణలో జరిగింది.
ఈ సమావేశం లో ఆంధ్రప్రదేశ్ నుంచి ఆప్తా రాష్ట్ర అధ్యక్షుడు ఎ. ఐ.పి టి ఎఫ్ జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి ఎ జి ఎస్ గణపతి రావు, తెలంగాణ నుంచి వైయస్ శర్మ జాతీయ కార్యదర్శి ఏఐపిటిఎఫ్ ఈ




సమావేశానికి హాజరయ్యారు, నూతన పెన్షన్ విధానాన్ని, జి పి ఎస్ ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే దాకా దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 1 ని పెన్షన్ ద్రోహ దినంగా ,బ్లాక్ డే గా పాటించాలని తీర్మానించారు , దేశవ్యాప్తంగా ఉపాధ్యాయు లందరికీ కేంద్ర ప్రభుత్వ ఉపాధ్యాయులకు చెల్లించే జీతాలను (ఢిల్లీ లో చెల్లిస్తున్నారు) ఒకే దేశం ఒకే జీతం ఇవ్వాలని అందుకోసం పోరాడుతాం తీర్మానించారు.

రాబోయే కార్యవర్గ సమావేశం ఏప్రిల్ లో బెంగుళూరు లో జరుగుతుంది అని, రాబోయే అఖిలభారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య ద్వైవార్షిక సమావేశం 2025 నవంబర్ లేదా డిసెంబర్ లో ఢిల్లీలో జరుగుతుందని దీనికి దేశీవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి ఎక్కువమంది ప్రాథమిక ఉపాధ్యాయులు పాల్గొనాలని అఖిలభారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య జాతీయ సెక్రెటరీ జనరల్ కమలకాంత్ త్రిపాటి పిలుపునిచ్చారు, ఈ జాతీయ కార్యవర్గ సమావేశంలో కేరళ నుంచి హరి గోవిందన్, తమిళనాడు నుంచి మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రింగరాజన్, ఉత్తరప్రదేశ్ నుంచి జాతీయ ఆర్థిక కార్యదర్శి మనోజ్ కుమార్ కర్ణాటక ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ నూల్గి మరియు 25 రాష్ట్రాల ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం నేతలు పాల్గొన్నారు

# విజయవాడలో హైందవ శంఖారావం సభ

## ఈ డిక్లరేషన్ లోని అంశాలు...


ఆలయాలకు పూర్తి స్వయంప్రతిపత్తి ఇస్తూ చట్ట సవరణ చేయాలి
హిందూ దేవాలయాల ఆస్తులు, వ్యవస్థలపై దాడులు అరికట్టాలి
చట్టవిరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
వినాయకచవితి, దసరా వంటి ముఖ్య పండుగల సమయంలో ఆంక్షలు విధించడం తగదు
దేవాలయాల్లో పూజలు, ప్రసాదాలు, కైంకర్యాలు భక్తిశ్రద్ధలతో చేయాలి
హిందూ దేవాలయాల్లో పనిచేస్తున్న అన్యమత ఉద్యోగులను వెంటనే తొలగించాలి
హిందూ ధర్మం పాటించే వారినే ట్రస్టు బోర్డుల్లో సభ్యులుగా నియమించాలి
ట్రస్టు బోర్డుల్లో రాజకీయేతర ధార్మిక వ్యక్తులకు



స్థానం కల్పించాలి
హిందూ దేవాలయాలకు సంబంధించిన ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడాలి
ఇప్పటికే అన్యాక్రాంతమైన ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకుని ఆయా ఆలయాలకు అప్పగించాలి
దేవాలయాల ద్వారా వచ్చే ఆదాయాన్ని ధార్మిక కార్యక్రమాలకే వినియోగించాలి
దేవస్థానాల ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వ

# పేపర్ టీ కప్ తో క్యాన్సర్ వస్తుందా?

## వైద్య నిలయం సలహాలు



కర్నూల్ జనవరి 05 (రిపబ్లిక్ న్యూస్):
ఒక్క పదంలో సమాధానం చెప్పాలంటే "అవును" అనే చెప్పాలి, ఎందుకంటే పేపర్ కప్స్ పైన మైక్రో ప్లాస్టిక్ లైనింగ్ ఉంటుంది, వేడి టీ అందులో పోసినప్పుడు ఆ మైక్రో ప్లాస్టిక్స్ కరిగిపోయి టీ తో పాటే మన శరీరం లోకి వచ్చేస్తాయి, ఆ మైక్రో ప్లాస్టిక్స్ క్యాన్సర్ కి కారకాలు. అందుకని పేపర్ కప్స్ లో టీ తాగటం వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది.ఒక పరిశోధన కోసం శాస్త్రవేత్తలు 100ml వాల్యూమ్‌తో కాగితపు కప్పుల్లో వేడి నీటిని పోసారు తరువాత వాటిని 15 నిమిషాలు అలాగే ఉంచారు, ఆ తరువాత పరిశోధకులుమైక్రోస్కోప్‌ను ఉపయోగించి కప్పుల్లోకి పోసిన వేడి నీటిని పరిశీలించారు, ప్రతి కప్పులో సగటున 25,000 మైక్రోప్లాస్టిక్‌లను కనుగొన్నారు. ఇంకా, వారు నీటిలో జింక్, సీసం మరియు క్రోమియం వంటి లోహాల ఉనికిని కూడా గుర్తించారు, ఇది కప్ లోపలి పొర నుండి వచ్చే అవకాశం ఉందట.ఇక సాధారణంగా మనం రోజుకు మూడు కప్స్ తాగినా అది 75,000 మైక్రోప్లాస్టిక్‌లను మన శరీరంలోకి పంపించినట్టే అందువల్ల క్యాన్సర్ రిస్క్ కూడా పెరుగుతున్నట్టే శాస్త్రజ్ఞులు తెలిపారు.

# రజకుల సమస్యలు పరిష్కరించాలని సదస్సు



కర్నూలు ప్రతినిధి జనవరి 05 ( రిపబ్లిక్ న్యూస్):
రజకులకు సామాజిక రక్షణ చట్టం తీసుకుని రావాలని కర్నూలు లో రజక ఆ హ హ హ వృత్తిదారులు డిమాండ్ చేశారు. నగరంలోని కార్మిక కర్షక భవనంలో ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు పై సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమంలో వారు మాట్లాడుతూ రజకులకు రక్షణ లేదని అందువల్ల ఎస్సీ ఎస్టీల చట్టం రజకులకు సైతం వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. రజక కార్పొరేషన్ కు నిధులు కేటాయించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర తరహాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రజకులకు 250 యూనిట్ల వరకు ఉచితంగా ఇవ్వాలని కొరారు. ప్రభుత్వ శాఖల్లో దోబి ఉద్యోగాలకు సంబంధించిన కాంట్రాక్టు ఉద్యోగాలను రద్దు చేసి రెగ్యులర్ ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను వారు ఆవిష్కరించారు.

# క్యాలెండర్ ఆవిష్కరించిన రాజ్యసభ మాజీ సభ్యులు టిజీ. వెంకటేష్



కర్నూలు ప్రతినిధి జనవరి 05 (రిపబ్లిక్ న్యూస్):
జీసెస్ సోల్జర్స్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్ ను రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ. వెంకటేష్ ఆవిష్కరించారు. హెూటల్ మౌర్య నందు టీజీ వెంకటేష్ చాంబర్ లోఈకార్యక్రమాన్ని నిర్వహించారు. క్రైస్తవులకు అన్ని విధాల తమ వంతు సహకారం ఉంటుందని టీజీ. వెంకటేష్ తెలిపారు. క్రైస్తవులకు సహయసహకారాలు అందిస్తున్న టీజీ. వెంకటేష్ కు, రాష్ట్ర మంత్రి టీజీ. భరత్ కు జీసస్ సోల్జర్స్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పాస్టర్ జీ. రవి కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో పాస్టర్ రవికుమార్,నాగరాజు, ప్రసాదరావు, ఏ.యం.దాన్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

# గౌరవ డాక్టరేట్ పొందిన నంద్యాల జిల్లా వైఎస్ఆర్సిపి ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్



నంద్యాల జనవరి 5 (రిపబ్లిక్ న్యూస్) :
వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్ కి ది అమెరికా యూనివర్సిటీ గ్లోబల్ పీస్ సంస్థ వారిచే సోషల్ సర్వీస్ విభాగంలో గౌరవ డాక్టరేట్ ప్రధానం చేయడం జరిగింది. డాక్టర్ అమీర్ బాష అనేక సంవత్సరాల నుండి సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటూ తనదైన గుర్తింపును పొందడం జరిగింది. ఇందులో భాగంగా మెడికల్ క్యాంపులు, స్వచ్ఛంద సంస్థల లో ఉన్న చిన్నారులకు, అనాధలకు, వృద్ధులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ, అదేవిధంగా సమాజంలో పేద బడుగు బలహీన వర్గాల ప్రజలను, మహిళలను ఆర్థికంగా సామాజికంగా చేయూతనందిస్తూ సేవా కార్యక్రమాలలో ముందుండేవారు. వీరి విశిష్ట సేవలను గుర్తించిన ది అమెరికన్ యూనివర్సిటీ గ్లోబల్ పీస్ సంస్థ దాల్మిల్ అమీర్ ని గౌరవిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి సోషల్ సర్వీస్ గౌరవ డాక్టరేట్ అందించడం జరిగింది.

# కామ్రేడ్ పి.సూర్యనారాయణ ఆశయాలను కొనసాగిస్తాం-సిపిఎం







కర్నూల్ ప్రతినిధి జనవరి 05 (రిపబ్లిక్ న్యూస్):
కర్నూలు కార్పొరేషన్ కల్లూరు సూర్యనారాయణ భవన్ నందు సిపిఎం పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ పి. సూర్యనారాయణ 37 వర్ధంతి సభ సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు సి హెచ్. సాయిబాబా అధ్యక్షతన జరిగింది. ముందుగా సూర్య నారాయణ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ముఖ్య అతిథులుగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి. నిర్మల సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి .గౌస్ దేశాయ్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. రామకృష్ణ నగర కార్యదర్శి టి .రాముడు హాజరయ్యారు. మాట్లాడుతూ బేతంచెర్ల సిమెంట్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తూ కార్మికుల సమస్యలపై నిరంతరం పనిచేయడమే కాకుండా చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న వ్యవసాయ కార్మికులు రైతులు రైతు కూలీల కోసం అనేక పోరాటాలు చేసి పేరు ప్రఖ్యాతలు గడించారు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న సూర్యనారాయణ అప్పుడప్పుడే అంచలంచలుగా ఎదుగుతున్న ఎదుగుదలను ఓరవలేని కాంగ్రెస్ గుండాలు తమకు అడ్డుగా ఉంటాడనే కక్షతో ప్రస్తుత మాజీ శాసనసభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి అనుచరులు బాంబులతో దాడిచేసి చంపించారని తెలిపారు. కార్మికులు రైతులు రైతు కూలీలు కష్టజీవుల కోసం నిరంతరం కృషి చేసిన సూర్యనారాయణను ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకొని ఆయన ఆశయాలను కార్యకర్తలు ముందుకు తీసుకు వెళ్లాలని తెలిపారు. ప్రస్తుతం ఉన్న బిజెపి ప్రభుత్వం మతాల పేరుతో రెచ్చగోడుతు మనువాద సిద్ధాంతాలను అమలు చేయాలని సనాతన ధర్మాన్ని పరిరక్షించాలని చెబుతూంది అన్నారు ఒకే దేశం ఒకే ఎన్నిక పేరుతో నరేంద్ర మోడీ రాష్ట్రాలకు హక్కులు లేకుండా హరించే ప్రయత్నం చేస్తున్నాడని ఈ విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం పోరాడుతుందని వారు తెలిపారు నగర కార్యదర్శి టి. రాముడు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలపై భారాలు వేస్తూ కరెంటు చార్జీలను విపరీతంగా పెంచడమే కాకుండా స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను మభ్యపెట్టి కరెంటు చార్జీలు పెంచడానికి ప్రయత్నం చేస్తుందని తెలిపారు ఈనెల 10వ తేదీన విద్యుత్ చార్జీలు తగ్గించాలని విద్యుత్ సౌదా దగ్గర ధర్నా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు అలాగే ఈనెల ఎనిమిదో తేదీన విశాఖపట్నానికి వస్తున్న నరేంద్ర మోడీ గో బ్యాక్ అంటూ 7 వ తేదీన కర్నూలు నగరంలో జిల్లా పరిషత్ నుండి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు విశాఖ పట్టణానికి వస్తున్న నరేంద్ర మోడీ విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయమని ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేశారు. సంక్రాంతి సందర్భంగా జరుగుతున్న ఆటల పోటీలను జయప్రదం చేయాలని, జనవరి ఫిబ్రవరి నెలలో జరగబోయే పార్టీ ఫండ్ క్యాంపెన్లో కార్యకర్తలు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె. సుధాకరప్ప, ఆర్. నరసింహులు, కె. ప్రభాకర్. సూర్య నారాయణ ట్రస్ట్ మెంబర్ యస్. రమణమూర్తి సూర్యనారాయణగారి భార్య రామసుబ్బమ్మ కూతురు సుజాత అల్లుడు మారుతి నగర కమిటీ సభ్యులు ఎస్ .మహమ్మద్ రఫీ. జి .ఏసు .శంకర్. రామకృష్ణ. ఎంసి ఆనందు. ఏ. గోవిందు. జె. శ్రీనివాసులు. ఎస్. షంషీర్. లక్ష్మయ్య. రెహమాన్ .మహిళలు రమణమ్మ. శారదమ్మ .తదితరులు హాజరయ్యారు.

# విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి

## ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బి రామకృష్ణ రెడ్డి డిమాండ్





కర్నూలు ప్రతినిధి జనవరి 0 5 (రిపబ్లిక్ న్యూస్):
భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కర్నూల్ నగర సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరాహార దీక్షలను మూడవరోజు ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ బస్తిపాడు రామకృష్ణారెడ్డి మూడవరోజు రిలే నిరాహార దీక్షకు ప్రారంభించినారు ఈ కార్యక్రమానికి సిపిఐ నగర కార్యవర్గ సభ్యులుఎం బీషన్న అధ్యక్షత వహించగా రిలే నిరాహార దీక్షలో కూర్చున్న దండలు వేసి మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు విద్యుత్ ఛార్జీలు పెంచిన సందర్భంలో చంద్రబాబు నాయుడు బాదుడే బాదుడు అనే పేరు పెట్టి ప్రజలతో మీటింగ్లు పెట్టి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని అసరమైతే విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తామని ప్రజలకు హామీ ఇచ్చి ప్రజలతో ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని అధికారులకు వచ్చిన ఏడు నెలల లోపే రాష్ట్రంలోని పేద ప్రజల పైన 17 వేల కోట్ల రూపాయలు ట్రూ యాప్ చార్జీల పేరుతో భారాలు మోపి ఈ పాప అంతా జగన్మోహన్ రెడ్డి ది అని చేతులు దులుపుకోవడం చాలా దుర్మార్గమని ఈరోజు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ చేస్తున్న ఆందోళన చాలా న్యాయబద్ధమైనదని తక్షణమే ట్రూ యాప్ విద్యుత్ ఛార్జీలను తక్షణమే తగ్గించాలని ఎన్నికల కొద్ది ముందు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సీట్లు పట్టణ ప్రాంతంలో నివసిస్తున్న పేదలకు రెండు సెంట్లు ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు నాయుడు హామీని నిలబెట్టుకోవాలి ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న వారందరికీ పట్టాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు .సిపిఐ చేస్తున్న దీక్షలు విజయవంతం కావాలని ప్రజల సమస్యలు పరిష్కారం కావాలని వారు ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి నగర సహాయ కార్యదర్శి
జి చంద్రశేఖర్ డి శ్రీనివాసరావు సిపిఐ కర్నూల్ రూరల్ మండల కార్యదర్శి సురేంద్ర యాదవ్ కార్యవర్గ సభ్యులు నాగరాజు వెంకటేశు సోమన్న ఈశ్వర్ ఆటో యూనియన్ నగర కార్యదర్శి కృష్ణారెడ్డి మహిళా సంఘం నాయకులు కోటమ్మ దేవి భాయ్ ధనలక్ష్మి శాఖా కార్యదర్శులు రామాంజి స్వామి రెడ్డి నగర్ శాఖ కార్యదర్శి రామాంజనేయులు గౌడ్ మహిళలు అధిక సంఖ్యలో ఈ దీక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రిపబ్లిక్ దినపత్రిక మరింత ముందుకు వెళ్లాలి





మహానంది, జనవరి 5,(రిపబ్లిక్ న్యూస్):
ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధి పత్రికలని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో పత్రికల పాత్ర ఎంతో ఉందని మహానంది ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి అన్నారు. మహానంది పోలీస్ స్టేషన్లో ఆదివారం 'రిపబ్లిక్' దినపత్రిక మహానంది మండల విలేకరి సోమశేఖర్ ఆధ్వర్యంలో 2025 నూతన సంవత్సరం క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో పత్రికల పాత్ర ఎంతో కీలకమైనదని అన్నారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తూ రిపబ్లిక్ దినపత్రిక మరింత ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు, చట్టాలపై అవగాహన, తదితర వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పత్రికలు, పాత్రికేయుల కృషి ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మాధవీలతపై నేను చేసిన వ్యాఖ్యలు తప్పే : జేసీ ప్రభాకర్ రెడ్డి



ఇటీవల న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి... సినీ నటి, బీజేపీ నేత మాధవీలతపై చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశం కావడం తెలిసిందే. జేసీ కాస్త తీవ్ర స్థాయిలో స్పందించి మాధవీలతను 'ప్రాస్టిట్యూట్' (వ్యభిచారి) అని సంబోధించారు. దీనిపై సర్వత్రా విమర్శలు వచ్చాయి.
ఈ నేపథ్యంలో జేసీ ప్రభాకర్ రెడ్డి స్పందించారు. మాధవీలతపై తాను చేసిన వ్యాఖ్యలు తప్పేనని, నోరు జారానని అంగీకరించారు. మాధవీలతకు క్షమాపణలు తెలుపుకుంటున్నానని వెల్లడించారు. తాడిపత్రిలో మహిళల కోసం న్యూ ఇయర్ రోజున జేసీ పార్క్ లో సెలబ్రేషన్స్ ఏర్పాటు చేశారు. అయితే, జేసీ పార్క్ కు మహిళలు వెళ్లొద్దని, అక్కడి అరాచక శక్తుల వల్ల మహిళలకు అపాయం కలిగొచ్చని మాధవీలత వ్యాఖ్యానించారు. దాంతో జేసీ భగ్గుమన్నారు. మాధవీలతపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారం కాస్తా జేసీ వర్సెస్ ఏపీ బీజేపీ నేతలు అన్నట్టుగా తయారైంది. జేసీ వ్యాఖ్యలను ఏపీ బీజేపీ నేతలు బాహాటంగానే ఖండించారు.

# రెవిన్యూ డివిజన్ పరిధిలో నూతనముగా చౌక ధరల దుకాణంలు

కర్నూల్ ప్రతినిధి జనవరి 05 రిపబ్లిక్ న్యూస్)
కర్నూలు రెవిన్యూ డివిజన్ పరిధిలో హేతుబద్దీకరణ ద్వారా నూతనముగా ఏర్పడిన చౌకధరల దుకాణములకు మరియు వివిధ రకముల కారణములతో ఖాళీలు ఏర్పడిన 74 చౌకధరల దుకాణములకు శాశ్వత ప్రాతిపదికన డీలర్లను నియమించుటకు . 23 /12/2024న రెవిన్యూ డివిజినల్ అధికారి నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందుకు గాను 876 అప్లికేషన్స్ స్వీకరించబడినవి. ఇందులో 720 అంగికరించబడినవి, 156 అప్లికేషన్స్ తిరస్కరించబడినవి. తదుపరి అంగీకరించబడిన 720 మంది దరఖాస్తుదారులకు, 05.01.2025 తేదీన, ఎ క్యాంపు నందు ఉన్న ఇందిరా గాంధీ మెమోరియల్ మునిసిపల్ హై స్కూల్ నందు



అభ్యర్థులకు వ్రాత పూర్వక పరిక్ష నిర్వహించబడినది. ఈ పరీక్షకు 625 అభ్యర్థులు హాజరు అయ్యారు. 05.01.2025 పరీక్ష అనంతరము మూల్యాంకనము జరిపి ఉత్తిర్ణులైన 1:5 రేషియో లో తేదీ



06.01.2025 న సోమవారం నాడు రెవిన్యూ డివిజినల్ అధికారి వారి ఆఫీస్ నందు ఇంటర్వ్యూ నిర్వహించబడును. తదుపరి ఎన్నికైన చౌకధరల దుకాణము వారీగా ఉత్తర్వులు ఇవ్వబడును.

# తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా కట్టుదిట్టమైన చర్యలు

## - నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు





కర్నూల్ ప్రతినిధి జనవరి 05 (రిపబ్లిక్ న్యూస్) వేసవికాలం సమీపిస్తున్న దృష్ట్యా నగరంలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు వెల్లడించారు. ఆదివారం ఆయన అశోక్ నగర్‌లోని నీటి శుద్ధి కేంద్రాన్ని కమిషనర్ పరిశీలించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా అవసరమైన చర్యలను ముమ్మరం చేయాలని, ఒకవేళ ఏర్పడినా తక్షణ నివారణకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని కమిషనర్ అధికారులకు సూచించారు. పైప్‌లైన్ లీకేజీలకు ఆస్కారం లేకుండా, సిబ్బందితో ముందుగానీ గుర్తించి తగిన మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఈఈ నరేష్, ఏఈ ఇ.ప్రవీణ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి కార్పొరేషన్ పథకాలు అందించాలి

## -ఎం.పి బస్తిపాటి నాగరాజు



కర్నూల్ ప్రతినిధి జనవరి 0 5 (రిపబ్లిక్ న్యూస్):
అర్హులైన ప్రతి ఒక్కరికి కార్పొరేషన్ పథకాలను అందించాలని కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు అధికారులను కోరారు.. నగరంలో ని ఎం.పి కార్యాలయంలో బీ.సీ కార్పొరేషన్ ఈ.డి జాకీర్ హుస్సేన్ ఎం.పి నాగరాజును మర్యాద పూర్వకంగా కలిశారు.. ఈ సందర్భంగా ఎం.పి బీ.సీ కార్పొరేషన్ పథకాల పై ఈ.డీ తో చర్చించారు... అనంతరం ఎం.పి నాగరాజు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం కార్పొరేషన్లను నిర్వీర్యం చేయడంతో అనేక మంది యువత ఉపాది కోల్పోయారన్నారు.. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మళ్ళీ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ నిధులను మంజూరు చేస్తూ ఉపాధి అవకాశాలు కలిపిస్తుందున్నారు...ఇక అర్హులైన ప్రతి ఒక్కరు కార్పొరేషన్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎం.పి కోరారు. రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, 8వ వార్డు కార్పొరేటర్ పరమేష్ పాల్గొన్నారు..

# నేడు నగరపాలకలో ప్రజా అర్జీల స్వీకరణ




కర్నూలు ప్రతినిధి జనవరి 05 (రిపబ్లిక్ న్యూస్)
నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు తమ కాలనీల్లో ఏవైనా స్థానిక సమస్యలుంటే వచ్చి ఫిర్యాదు చేయవచ్చున్నారు. ఉదయం 10 గంటల నుండి కార్యక్రమం ప్రారంభమవుతుందని, అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు

# బ్లాక్ బెల్ట్ సాధించిన కరాటే విద్యారులకు ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి చేతుల మీదుగా సర్టిఫికేట్‌లు





కర్నూల్ ప్రతినిధి జనవరి 05 (రిపబ్లిక్ న్యూస్)
గత నెల 29 వ తేదీన హైదరాబాద్ లో కీయో జపాన్ శోటోకాన్ కరాటే అసోసియేషన్ ఇండియా ఫౌండర్ వారి ఆధ్యర్యంలో జరిగిన బెల్ట్ టెస్ట్ పరీక్ష ఎనిమిది కరాటే విద్యార్థులు బ్లాక్ బెల్ట్ సాధించడం జరిగింది. ఈరోజు పాణ్యంఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి చేతుల మీదుగా కరాటే విద్యార్థులకు సర్టిఫికేట్ లు అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి , తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్ ,కరాటే మాస్టర్లు గౌస్,శేఖర్, మునాఫ్,విద్యార్థులు లోకేశ్వరి,జగన్, మునాఫ్, మాన్విత్,అర్జున్,ప్రీడి పాల్,నిజాముద్దీన్,జెస్సీ పాల్గొన్నారు.

# హిందూ శంఖారావం విజయవంతం కావాలని విశ్వహిందూ పరిషత్ నాయకుల సంఘీభావం



కర్నూల్ ప్రతినిధి జనవరి 5 (రిపబ్లిక్ న్యూస్):విజయవాడలో జరిగే శంఖారావం కార్యక్రమం విజయవంతం కావాలని కర్నూలు లో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపారు. నగరంలోని ఆదిత్య పాఠశాల ముందు విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు వాసుదేవయ్య, హిప్నోసిస్ డాక్టర్ సిరిగిరెడ్డి జయారెడ్డి పాల్గొని హిందూదేవాలయాల్లో భక్తులు దైవదర్శనం ఉచితంగా ఉండాలని కోరారు. దేవాలయాల నిర్వహనను హిందూ ధార్మిక సంస్థలకు అప్పగించాలని కోరారు. సనాతన ధర్మ బోర్డు ను ఏర్పాటు చేయాలని వాసుదేవయ్య డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలోవాసుదేవయ్య,డాక్టర్. సిరిగిరెడ్డి జయారెడ్డి.తదితరులు పాల్గొన్నారు.

## మానసిక వికలాంగులకు సేవ చేయడం

# హర్షంచదగ్గ విషయం

## - డాక్టర్ సిరిగిరెడ్డి జయారెడ్డి.



కర్నూలు ప్రతినిధి జనవరి 05 (రిపబ్లిక్ న్యూస్):
కల్లూరు ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదిత్య పాఠశాలలో మానసిక వికలాంగులకు ఫింక్షన్ పంపిణీ చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హిప్నోథెరపిస్టు డాక్టర్. సిరిగిరెడ్డి జయారెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 5వ తేదీన ఎస్.కే. బాష ఆధ్వర్యంలో ఫింక్షన్ లు ఇవ్వడం హర్షంచదగ్గ విషయం అన్నారు. మానసిక వికలాంగులు ధైర్యంగా ఉండి ప్రతి రోజు ధ్యానం, చిన్న చిన్న వ్యాయామాలు చేస్తు ఆరోగ్యం కాపాడుకోవాలని కోరారు. సామాజిక సేవచేస్తున్న ఫోటో గ్రాఫర్లను డాక్టర్. జయారెడ్డి అభినందించారు. దివ్వంగులకు డాక్టర్ చేతులమీదుగా ఫింక్షన్ పంపిణీ చేశారు.

# పంచలింగాల ను రాష్ట్రంలోనే టాప్ వన్ గ్రామంగా తీర్చిదిద్దుతా..

## : ఎం.పి బస్తిపాటి నాగరాజు

కర్నూల్ ప్రతినిధి జనవరి 05 (రిపబ్లిక్ న్యూస్):
తన సొంత గ్రామం పంచలింగాల ను అన్ని విధాలా అభివృద్ధి చేసి రాష్ట్రంలో నే టాప్ వన్ గ్రామంగా తీర్చిదిద్దుతానని కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు పేర్కొన్నారు.. కర్నూలు రూరల్ మండలం పంచలింగాల గ్రామంలోని ఎస్సీ కాలనీలో ప్రభుత్వం రూ.14 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీ. సీ రోడ్డు కు ఆయన భూమి పూజ చేశారు..ఈ సందర్భంగా ఎం.పి మాట్లాడుతూ త్వరలోనే పంచలింగాల రూపు రేఖలు మారబోతున్నాయన్నారు.. ఎవరూ కని విని ఎరుగని రీతిలో గ్రామం అభివృద్ధి కాబోతుందన్నారు...ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.



# ఆంధ్రప్రదేశ్ బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలోఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కు వినతి పత్రం




కర్నూలు ప్రతినిధి జనవరి 05(రిపబ్లిక్ న్యూస్):
ఆంధ్రప్రదేశ్ బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో 5-1-2025 ఈరోజు కోడుమూరు నియోజకవర్గం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేడా కొనసాగింపు బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా యూత్ అధ్యక్షులు సిరిగిరి మద్దిలేటీ మద్ది కలిసి వినతి పత్రం సమర్పిస్తూ కోడుమూరు టౌన్ లక్ష్మీనగర్ లో బేడ బుడగ జంగాల స్థితిగతులను వివరిస్తూ తాము ఎదుర్కొంటున్న కుల సర్టిఫికెట్ లేక ప్రభుత్వ పథకాల అందక పడుతున్న ఇబ్బందులను సమస్యలని క్లుప్తంగా వివరించి తమకు తప్పకుండా న్యాయం చేయాలని కోరడం జరిగింది. కాలనిలో డ్రైనేజీ కాలువలు, సిమెంట్ రోడ్లు వేయాలని కోరారు ,ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ సమస్యలు త్వరలో పూర్తి చేస్థాను. కుల సర్టిఫికెట్ లేక రాష్ట్రమంతా కులం నష్టపోతుంది ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి మీ సమస్యను తెలియజేసి మీకు న్యాయం జరిగే కోణంలో చర్యలు తీసుకుంటానని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమం కోడుమూరు టౌన్ బేడా బుడగ జంగాల సీనియర్ నాయకులు ఈభూతి రంగన్న, సిరిగిరి తిమ్మప్ప మరియు యువకులు దూపం మద్దిలేటీ, సిరిగిరి చిట్టిబాబు, K , శ్రీ రామ్, , ప్రసాదం మద్ది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థినీలకు రక్షణ కల్పించాలి- ఎస్ఎఫ్ఐ

## నూతన కర్నూలు జిల్లా ఎస్ఎఫ్ఐ కన్వీనర్ .కే సంయుక్త




కర్నూల్ ప్రతినిధి జనవరి 0 5 (రిపబ్లిక్ న్యూస్ )
భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా బాలికల కన్వెన్షన్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో నగర నాయకులు పావని అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ నిర్మలమ్మ ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా బాలికల కన్వీనర్ కే సంయుక్త మాట్లాడుతూ రోజురోజుకీ ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థినిలకు రక్షణ లేకుండా పోతుంది. ఇప్పుడిప్పుడే తల్లిదండ్రులు విద్యార్థినీలను చదువుకోవడం కోసం పంపుతుంటే అంతలోనే విద్యాసంస్థల్లో విద్యార్థినీలపై లైంగిక దాడులు, హత్యాచారాలు జరుగుతున్నాయి. తల్లిదండ్రులు విద్యార్థులని చదివించాలంటే భయంకరమైనటువంటి పరిస్థితులు నెలకొంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి ప్రభుత్వ విద్యాసంస్థల దగ్గర విద్యార్థినిలకు రక్షణగా వాచ్మెన్లను ఏర్పాటు చేయాలి. విద్యార్థినిల పట్ల లైంగిక వేధింపులు చేసినటువంటి నిందితులను కఠినంగా శిక్షించాలి. వాచ్మెన్లను ఏర్పాటు చేయడం ద్వారా అల్లరి మూకల నుంచి విద్యార్థినీలకు రక్షణ కల్పించిన వాళ్ళు అవుతారు. విద్యార్థినీల అక్షరాస్యతను పెంచాలంటే విద్యార్థులకు రక్షణ కల్పించాలి. రక్షణ కల్పించకపోతే విద్యార్థినిల అక్షరశాతం తగ్గిపోతుంది అన్నారు. విద్యార్థినీలను చదువుకు దూరం చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు జిల్లా బాలికల కన్వీనర్ గా సంయుక్త, కో-కన్వీనర్లుగా పావని, శ్రీ వాణి, మరియు కమిటీ సభ్యులు. పాల్గొన్నారు.